తాగేదెలా?

శుభ్రతకు నోచని నీటి ట్యాంకులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, జోగిపేట, నారాయణఖేడ్, హత్నూర, కోహీర్, గుమ్మడిదల

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

నెల రోజులుగా కురుస్తున్న వర్షాలు, అపరిశుభ్ర వాతావరణంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, లీకేజీలను అరికట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ట్యాంకుల వద్ద క్లోరినేషన్ సక్రమంగా చేయకపోవడం సమస్యగా మారింది. నెలలో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయాలనే నిబంధనను ఎక్కడా పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నారు. పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది.

జిల్లాలో తాగునీటి సరఫరా ఇలా

- ఆవాస ప్రాంతాలు: 943
- మిషన్ భగీరథ కనెక్షన్లు: 2,65,127
- నీటి శుద్ధి ప్లాంట్లు: 13
- తాగునీటి ట్యాంకులు: 1655
- పైపులైను (కిలో మీటర్లు): 3300

చేతులెత్తేస్తున్న పంచాయతీ సిబ్బంది

మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి, పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేటలలోని మంజీరా నది పరీవాహక ప్రాంతం నుంచి శుద్ధి చేసిన నీటిని పల్లెలకు సరఫరా చేస్తున్నారు. 647 గ్రామాల్లోని 1,655 తాగునీటి ట్యాంకుల ద్వారా జిల్లాలో ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. ప్రతి నెలా 1, 11, 21వ తేదీల్లో ట్యాంకులను శుభ్రం చేయాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. మిషన్ భగీరథ జలాలు, స్థానిక బోర్ల నీటిని ఒకే ట్యాంకు ద్వారా సరఫరా చేస్తూ.. క్లోరినేషన్‌ను విస్మరిస్తున్నారు. పంచాయతీలకు పాలకవర్గాలు లేక పర్యవేక్షణ సరిగా లేకపోవడం, నిధుల కొరతతో క్లోరినేషన్ విషయంలో పంచాయతీ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.



బిలాల్‌పూర్‌లో మినీ ట్యాంకుకు పాకురు

క్షేత్రస్థాయి పరిస్థితి

- అందోలు మండలంలోని చాలా గ్రామాల్లో ప్రతి నెలా మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. కొన్ని చోట్ల ట్యాంకుల చుట్టూ పొదలు పెరిగాయి. వర్షపు నీరు నిలుస్తోంది.
- ఖేడ్ మండలం చాప్టా(కె), ఈ పంచాయతీ పరిధిలోని తండాల్లో క్లోరినేషన్ చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా శుభ్రం చేయాలని కోరుతున్నారు.
- హత్నూర మండలం కాసాలలోని మంచి నీటి ట్యాంకులో క్రిమి, కీటకాలను స్థానికులు గుర్తించారు. ఈ మండలంలోని నాగారం, హత్నూర, దౌలాపూర్‌లో ట్యాంకుల మెట్లు శిథిలం కావడంతో సిబ్బంది పరిశుభ్రం చేయడం లేదు. గుమ్మడిదల మండలం వీరారెడ్డిపల్లిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- కోహీర్ మండలం పైడిగుమ్మల్, గుర్జువాడ, బిలాల్‌పూర్, పర్యపల్లి తదితర గ్రామాల్లో తాగు నీటి ట్యాంకులు నాచుపట్టి దర్శనమిస్తున్నాయి.

పంచాయతీ అధికారులు దృష్టి సారించాలి

జిల్లాలో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయకుంటే చర్యలు తీసుకుంటాం. పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు దృష్టి సారించాలి. ట్యాంకులతోపాటు వాటి పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచాలి. పైపుల లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలి. –సాయిబాబా(డీపీవో), ఎస్కే పాషా(మిషన్ భగీరథ ఈఈ).

డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008లో 70:30 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను డీఈవో కార్యాలయంలో శుక్రవారం పరిశీలించారు. ఇందుకోసం కార్యాలయంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. తొలి రోజు 132 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. నేడు కూడా పరిశీలన ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సంగారెడ్డి అర్బన్, సదాశివపేట, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. సదాశివపేట తహసీల్దార్ సరస్వతి తెలిపిన వివరాలు.. పెద్దాపూర్‌లోని శిల్పా వెంచర్ నిర్వాహకులు వరద కాల్వను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. స్థానిక రైతుల ఫిర్యాదుతో శుక్రవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. అక్కడి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నాలాను ఆక్రమించినట్లు నిర్ధారించారు. ఓ హోటల్ నిర్వాహకుడు అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూడా నేలమట్టం చేశారు.

పూర్తి నీటి మట్టానికి చేరువైన సింగూరు

పుల్కల్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువైంది. ఎగువ నుంచి స్థిరంగా వరద కొనసాగుతోంది. 6, 11వ నంబరు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 20,546 క్యూసెక్కులు కాగా.. అవుట్‌ఫ్లో 24,250 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు. ప్రస్తుతం 29.857 టీఎంసీల నీటితో జలాశయం కళకళలాడుతోంది.

కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న 14 మందిపై కేసు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: కంది మండలం బ్యాతోల్, బ్యాతోల్ తండాల్లో అక్రమంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న కేంద్రాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు చేపట్టారు. ఇద్దరు లారీ యాజమానులు, ఇసుక తయారీలో పాల్గొన్న 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు సంగారెడ్డి గ్రామీణ సీఐ అశోక్ తెలిపారు. రెండు లారీలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సంగారెడ్డి గ్రామీణ ఎస్ఐ విశ్వజన్ పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో సామాన్యులపై సర్కారు దాడి: చింతా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ప్రజాపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా సర్కారు దాడి కొనసాగుతోందని సంగారెడ్డి ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు చింత ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్లు హైడ్రా తీరు ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, పలుకుబడి ఉన్న వ్యక్తులకు నోటీసులతో సరిపెడుతూ.. పేదోడి గూడుపై మాత్రం కర్కశంగా వ్యవహరించడాన్ని తప్పు పట్టారు. నిర్మాణానికి అనుమతి ఇచ్చిన వారిపై ముందుగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఎఫ్ఆర్ఎస్ ముందున్న ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. మహనీయుల చరిత్రను భావి తరాలకు తెలిపేందుకు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, పురపాలక సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ వయో వృద్ధుల ర్యాలీని ప్రారంభించారు.

మెనూ ప్రకారం వడ్డించాలి

మొగుడంపల్లి(జహీరాబాద్ అర్బన్): మెనూ పక్కాగా అమలు చేయాలని, విద్యార్థులకు రుచికరంగా వండి వడ్డించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. మొగుడంపల్లిలోని గిరిజన బాలికల గురుకులాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ జలపాతాలు, గొట్టంగుట్ట అటవీ అందాలను అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్ కలిసి సందర్శించారు.



జలపాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.రాధాకృష్ణ చౌహాన్ శుక్రవారం తీర్పు వెలువరించారని ఎస్పీ చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కల్వకుంటకు చెందిన షేక్ సాబేర్ ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా పనిచేసేవాడు. కొండాపూర్‌కు చెందిన మహ్మద్ మోసిన్ ఆయనకు అత్త. సదాశివపేట మండలం పెద్దాపురంలో నివాసం ఉండేవారు. ఆమె వద్ద షేక్ సాబేర్ రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వమని మోసిన్ కోరగా గొడ్డలితో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. 2018, అక్టోబరు 15న ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టుకు సమగ్ర ఆధారాలు, వివరాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో షేక్ సాబేర్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్పీ రూపేష్ పేర్కొన్నారు.

యువజనుల హుషారు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వేడుకలను టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి ప్రారంభించారు. ఉన్నత స్థానమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు సాగాలని యువతకు సూచించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి ఖాసీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.




యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



ఆకట్టుకున్న గిరిజన నృత్యం

పర్యావరణ హితం.. వృత్తి నైపుణ్యం!

● విద్యార్థులకు ఎల్‌ఈడీ దీపాల తయారీపై శిక్షణ



న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సిద్దిపేట

విద్యార్థి దశలోనే వృత్తి నైపుణ్యాలు పెంపొందిస్తూ.. పర్యావరణ హితం వైపు యోచించేలా జాతీయ హరిత దళం (ఎన్‌జీసీ) సంకల్పించింది. చిట్టి బుర్రలకు పదును పెట్టేలా.. కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్‌ఈడీ దీపాల తయారీ శిక్షణకు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా ఒక్కో జిల్లాకు పాఠశాలలను ఎంపిక చేసి తర్ఫీదు ఇస్తోంది. జిల్లా స్థాయిలో ఒక రోజు కార్యశాల చేపడుతోంది. సంగారెడ్డిలో 23, సిద్దిపేటలో 26 తేదీలలో నిర్వహించారు.

200 పాఠశాలల్లో అమలు

జాతీయ హరితదళం ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎల్‌ఈడీ దీపాల తయారీపై శిక్షణకు ఒక్క జిల్లాకు 50 చొప్పున 200 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో బడిలో సైన్స్ ఉపాధ్యాయుడు, ముగ్గురు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. ఎల్‌ఈడీ దీపం తయారీపై అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి సమన్వయకర్త రాజశేఖర్ ఆధ్వర్యంలో నిపుణులు విద్యార్థులకు వివరిస్తున్నారు. పిల్లలతో వాటిని రూపొందింపజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తయారు చేసిన బల్బులు పాఠశాల, ఇంటి వద్ద వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు.

అన్ని పాఠశాలల్లో..



ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ (ఎకో) క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (ఎల్ఐఎఫ్ఈ) థీమ్‌గా ఎంచుకొని ఏడు అంశాలను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎల్ఈడీ దీపాల తయారీపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

ఎల్‌ఈడీ ప్రయోజనాలు ఇలా..

- 90 శాతం విద్యుత్తు ఆదా.
- ఎక్కువ కాలం మన్నిక, దృఢంగా ఉంటాయి.
- ఉత్పత్తి చేసేందుకు తక్కువ ఖర్చవుతుంది.
- తయారీ ఖర్చు తక్కువ.
- ఉద్గారాలు తక్కువ శాతం వెలువడుతాయి.

వాడే వస్తువులు, తయారీ

బల్బు తయారీకి ఎల్‌ఈడీ స్ట్రిప్, బీసీబీ, ట్రాన్స్‌ఫార్మర్, రెసిస్టర్, దయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ను వాడుతారు. ముందుగా ఎల్‌ఈడీ స్ట్రిప్ పైభాగాన్ని తీసుకోవాలి. అందులో రెసిస్టర్, దయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సహాయంతో అన్ని భాగాలను బిగించాలి. 230 వాట్స్ ఉన్న విద్యుత్తును ఆటోమేటిక్‌గా 10 వాట్స్‌కు మార్చుకుంటుంది.

ఉత్సాహంగా నేర్చుకున్నా:



ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీని ఉత్సాహంగా నేర్చుకున్నా. అధికారులు చక్కగా అవగాహన కల్పించారు. నేను ఓ ట్యూబ్ లైట్ తయారుచేశా. కేవలం రూ.వంద ఖర్చయ్యింది. దాన్ని పాఠశాలలోని ఓ గదిలో వినియోగిస్తున్నాం.

సహస్ర, విద్యార్థిని ఎద్దుమైలారం

సత్ఫలితాలు:

జపాన్ వంటి దేశాల్లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తి తయారు చేసే కుటీర పరిశ్రమలెన్నో ఉన్నాయి. ఇందుకు దీటుగా భారత్ తయారు కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. నైపుణ్యం పెంపొందిస్తే ఉపాధి సులువుగా లభిస్తుంది. విద్యార్థి దశ నుంచే అలవర్చడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయి.

బేతి భాస్కర్, జిల్లా ఎన్‌జీసీ సమన్వయ కర్త, సిద్దిపేట

గగనతలంలో శిక్షణ.. లక్ష్య సాధనకు తపన

న్యూస్‌టుడే, సిద్దిపేట, సిద్దిపేట టౌన్



నిరంజన్‌రెడ్డి

ఆసక్తి, ధైర్యానికి సాధన తోడైతే లక్ష్య సాధన పెద్ద కష్టమేమి కాదని నిరూపించారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నిరంజన్‌రెడ్డి. గగనతలంలో ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి చేశారు. బీకామ్ కంప్యూటర్స్ (తృతీయ) చదువుతున్న ఇతడి స్వస్థలం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి. తల్లిదండ్రులు లత, బ్రహ్మానందరెడ్డి. వ్యవసాయ కుటుంబం. ఆర్మీలో చేరాలనే తలంపుతో ప్రథమ సంవత్సరంలోనే ఎన్‌సీసీలో చేరారు.

త్రివిధ దళాల్లో కొలువే లక్ష్యంగా అడుగేసిన నిరంజన్‌రెడ్డి.. వాయుసేన ఆధ్వర్యంలో కొనసాగిన 23 రోజుల పారా బేసిక్ కోర్సు పూర్తి చేశారు. ఆగ్రాలో ఈ నెల 2 నుంచి 24 వరకు శిబిరం కొనసాగగా, కరీంనగర్ బెటాలియన్ నుంచి పాల్గొన్నది ఇతనొక్కడే కావడం విశేషం. పారా బేసిక్.. వాయుసేన విభాగంలో ప్రాథమిక స్థాయి శిక్షణ ఇచ్చే కోర్సు. దీనికి 175 మంది ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు 50 మంది పాల్గొన్నారు. శిక్షణను పూర్తి చేసుకొని ధ్రువపత్రం అందుకున్న కేడెట్‌ను వైస్ ప్రిన్సిపల్ డా. పి. అయోధ్యరెడ్డి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని, ఏవో సులేమాన్ అభినందించారు.

శిక్షణ సాగిందిలా..

తొలుత టేబుల్ (3 పీట్ల ఎత్తు) నుంచి దూకడం, నిలదొక్కుకునే తీరుపై మెలకువలు నేర్పించారు. కదిలే చక్రాలపై 9 అడుగుల ఎత్తు నుంచి దూకడం, తర్వాత 11 అడుగుల ఎత్తుపై నుంచి ప్యారాచూట్ ఆధారంగా దూకడం, గగనతల ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దూకే ముందు పాటించాల్సినవి నేర్పించారు. 12 రోజుల తర్వాత 30 అడుగుల ఎత్తు నుంచి దూకడాన్ని (ఫ్యాన్ టెస్టు) పరీక్షించారు. ఒకరోజు ఎరోప్లేన్‌లో 4 గంటలు ప్రయాణించారు. శిక్షణలో 15 రోజులు పూర్తయ్యాక రోప్లేన్ నుంచి నేరుగా దూకడం (1250 అడుగుల ఎత్తు) మొదలవుతుంది. 'ప్రారంభంలో కొంత భయమేసినా నిత్యం సాధనతో గొప్ప అనుభూతి కలిగింది. ఆర్మీలో ఉన్నత ఉద్యోగమే లక్ష్యమ'ని చెబుతున్నారు నిరంజన్‌రెడ్డి.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



సూచనలు చేస్తున్న రమేష్ సరియల్

పాపన్నపేట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందుతుందని 33(టీ) సంగారెడ్డి యూనిట్ ఆర్మీ కమాండింగ్ అధికారి రమేష్ సరియల్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సీసీ ధ్రువపత్రాలతో పోటీ పరీక్షల్లో మేలు కలుగుతుందని చెప్పారు. హెచ్ఎం మహేశ్వర్, సీటీవో ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోండి



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ రాములు తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీసీ నీరజా ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, ప్రముఖ రచయిత బి.ఎస్.రాములు ఆకాంక్షించారు. శుక్రవారం ములుగులోని కొండా ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు ఇప్పుడు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. దేశం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయం 8వ వార్షికోత్సవ నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, సురేష్‌కుమార్, సుచిత్ర, చీనా, ప్రశాంత్, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తే విజయం ఖాయం



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే సృజనాత్మక శైలిని అలవర్చుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ సూచించారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. 6 నుంచి 9 తరగతి వరకు విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభ చాటుకునేందుకు కళా ఉత్సవ్ పోటీలు చక్కటి వేదికన్నారు. శ్రమిస్తే విజయం ఖాయమని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. అనంతరం హవేలిఘనపూర్ శివారులోని డైట్ కళాశాలను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, సిబ్బంది గురించి డైట్ ప్రిన్సిపల్ రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మాధ్యమంలో 100 సీట్లు కేటాయించాలని, అధ్యాపకులను నియమించాలని మహ్మద్ రియాజుద్దీన్.. రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవోలు నీలకంఠం, మధుమోహన్, హెచ్ఎంలు కరుణాకర్, నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాప్‌లతో జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ బాబు

న్యూస్‌టుడే, మెదక్ టౌన్: అనవసరమైన ప్రైవేట్ యాప్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ సంయుక్త సలహాదారు సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రుణ యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సీ-డీఏసీ ప్రాజెక్టు మేనేజర్ జగదీష్ బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి, ట్రాయ్ సీనియర్ రీసెర్చ్ అధికారి వెంకటపతి, వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దాంపత్యానికి 'ఆదర్శం' తోడూనీడ

పూలదండల మార్పిడి, ప్రమాణ స్వీకారంతో వివాహం పూర్తి



నూతన దంపతులు శ్రీకాంత్, స్వేచ్ఛ, పార్టీ, సంఘం నేతలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఆడంబరాలకు దూరంగా యువతి, యువకుడు శుక్రవారం సిద్దిపేటలో ఆదర్శ వివాహం చేసుకున్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యార్థిని స్వేచ్ఛ.. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఆదర్శ వివాహంతో ఒక్కటయ్యారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు పూలదండలు మార్పించి, ప్రమాణ పత్రం చదివించారు. హాజరైన సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి సూర్యం మాట్లాడారు. కుల, మత సంప్రదాయాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను పెంచుతోందన్నారు. వివాహాలను ఆడంబరంగా చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. దానికి భిన్నంగా శ్రీకాంత్-స్వేచ్ఛలు ఆదర్శ వివాహం చేసుకొని సమాజానికి సవాల్ విసిరారన్నారు. యువ జంటను నాయకులు ఆశీర్వదించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

ఆవిర్భావ దినోత్సవం.. పోటెత్తిన భక్తజనం



మెదక్ పట్టణంలో భక్తుల భారీ ర్యాలీ



సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె.రూబెన్ మార్క్, మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య



చర్చి ప్రాంగణంలో శిలువ ఊరేగింపు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: చర్చి ఆఫ్ సౌత్ ఇండియా కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ వేడుకలను శుక్రవారం మెదక్‌లోని సీఎస్ఐ చర్చి ఘనంగా నిర్వహించారు. మెదక్ డయాసిస్ పరిధి ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సంఘాల జెండాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల కోలాటాలు, యువత నృత్యాల మధ్య భారీ ర్యాలీ కొనసాగింది. శిలువను ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించగా, డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా. కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు చేపట్టారు. దైవ సందేశం వినిపించారు. స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావాన్ని పురస్కరించుకొని బిషప్ సతీమణి కె.ప్రిసిల్లా పరిమళ రూబెన్ మార్క్ జ్యోతి వెలిగించారు. భక్తబృందం పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● చర్చి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన భవనంలో సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ఇన్‌ఛార్జి బిషప్.. మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎస్ఐ సంఘం విశ్వసనీయత, విశిష్టతతో కూడుకున్నదని తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు వేడుకలో పాల్గొన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. డయాసిస్ లే సెక్రటరీ ప్రభు కిరణ్, వైస్ ఛైర్మన్ విన్‌స్టన్, విమల్ సుకుమార్, జయానంద్, విల్సన్, సాల్మన్, గంట సంపత్, సాంసన్ సందీప్, స్టువర్ట్ ఫ్రాంక్ జాన్సన్, సువాన్ డగ్లస్, జోయల్, ఉమెన్ ప్రెసిడెంట్ ఎలిజబెత్, సెక్రటరీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనా మందిరంలో భక్తులు

ఐదునెలల్లోనే రూ.28.85 కోట్ల లాభాలు



సిద్దిపేటలో ఉద్యోగినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోలు కేవలం ఐదు నెలల వ్యవధిలో రూ.28.85 కోట్ల లాభాలు ఆర్జించాయని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. రాష్ట్రస్థాయిలో సిద్దిపేట ఆర్టీసీ డిపో లాభాల ఆర్జనలో తృతీయ స్థానం పొందిన నేపథ్యంలో శుక్రవారం సిద్దిపేటలో ఉద్యోగులు, సిబ్బంది అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎం 400 మంది డిపో ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ప్రగతిచక్రం అవార్డు, రూ.2 లక్షల పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే మూడు నెలలు పెళ్లిళ్లు, పండగల సీజన్‌లో మెరుగైన లాభాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి నెలా ఇచ్చే ప్రగతి చక్రం అవార్డులను అందరూ అందుకోవాలని ఆకాంక్షించారు. ఆర్టీసీకి డ్రైవర్లు, కండక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని, ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలగాలని సూచించారు. సర్వీసుల సంఖ్య పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన ముగ్గురికి బహుమతులు అందజేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, దుబ్బాక ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి కనకలక్ష్మి, సిబ్బంది మౌలానా, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మను వీడని గంగమ్మ..



రాజగోపురంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ



ఆలయం ముందు వరద ప్రవాహం

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నాలుగు రోజులుగా వరద కొనసాగుతోంది. శుక్రవారం వరద మరింత పెరగడంతో అర్చకులు కూడా అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 22,000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ విజయ్ కుమార్ తెలిపారు.

అనిశాకు చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



షకీల్

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటరు పేరు మార్పిడికి అవసరమయ్యే ధ్రువపత్రం మంజూరు చేసేందుకు రూ.5వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఎండీ షకీల్ అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కాడు. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో చోటుచేసుకుంది. అనిశా డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాలు.. కొండాపూర్‌కు చెందిన మాచేపల్లి అఫ్సర్ అదే గ్రామానికి చెందిన జి.దశరథ్‌కు చెందిన ఇంటిని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఆ ఇంటికి సంబంధించిన విద్యుత్తు మీటరును తన పైరుపైకి మార్చుకునేందుకు విద్యుత్తు శాఖకు గ్రామ పంచాయతీ నుంచి జారీ చేసిన ధ్రువపత్రం అందజేయాలి. ఇందుకోసం రెండేళ్ల నుంచి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. డబ్బులు ఇవ్వనిదే పని చేయలేమని ఇటీవల పంచాయతీ కార్యదర్శి షకీల్ స్పష్టం చేశాడు. ఇందుకోసం తొలుత రూ.25 వేలు డిమాండ్ చేసిన కార్యదర్శి.. చివరకు రూ.7వేలకు ఒప్పుకొన్నాడు. ఈ విషయంపై అనిశా అధికారులు అఫ్సర్ సమాచారమిచ్చాడు. కొండాపూర్‌లోని కార్యాలయంలో అఫ్సర్ నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని అనిశా అధికారులు పట్టుకున్నారు. అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్-1064కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనిశా సీఐలు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో మాయమైన రూ.4.50లక్షలు స్వాధీనం!

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మాయమైన రూ.4.50లక్షల నగదును పోలీసులు వారం రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన మహమ్మద్ రఫీ, రెహనా బేగం దంపతులు ఈనెల 19న మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా షాపుర్‌నగర్ నుంచి కామారెడ్డి డిపోనకు చెందిన బస్సులో ప్రయాణిస్తుండగా.. కౌడిపల్లిలో నగదు ఉన్న సంచి మాయమైంది. దీనిపై స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిఘా కెమెరాలు, ఇతర మార్గాల్లో ఆ రోజు బ్యాగుతో సహా బస్సులో నుంచి దిగిపోయిన మహిళను గుర్తించారు. వారం రోజులు శ్రమించి మహిళను పట్టుకొని.. రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మహిళగా గుర్తించినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డిని వివరణ కోరగా.. నగదు స్వాధీనం చేసుకున్నామని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నా..



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, లేఖ, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాలు.. అనంతపురం జిల్లా కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గతంలో కదిరిలో సీఐగా పని చేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్ వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. ఉదయ్ కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. మూడేళ్ల కిందట అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించి, కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో అతనిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితోపాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టడంతో వినికిడి కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు.


న్యాయస్థానంలో ఫిర్యాదు: ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయగా పోలీసులపై కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధించారని కుటుంబసభ్యులు తెలిపారు. కేసును వెనక్కి తీసుకోవాలని, తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారని అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడని వాపోయారు. సిద్దిపేట బాలిక దూరమయ్యాక అతడు తెలంగాణలోని భద్రాచలం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారు దూరమయ్యారు. ఈ ఘటనలతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఢీకొన్న ఇంజినీరింగ్ కళాశాల బస్సులు

● ప్రమాదంలో డ్రైవర్ మృతి ● దాదాపు 30మంది విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన రెండు బస్సులు



నాగరాజు

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక డ్రైవర్ మృతి చెందాడు. మరో డ్రైవర్‌తో పాటు దాదాపు 30మంది విద్యార్థులు, అధ్యాపకులకు గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు.. విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వెళుతోంది. హైదరాబాద్ నుంచి విద్యార్థులు, అధ్యాపకులతో వస్తున్న మరో బస్సు కళాశాలకు అతి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు వాటిలో ఇరుక్కుపోయారు. విద్యార్థులతో వస్తున్న బస్సులో సుమారు 30 మంది వరకు ఉండగా.. వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల అద్దాలు పగలడంతో ముందు కూర్చున్న విద్యార్థులకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని గాయపడిన వారిని సంగారెడ్డి, నర్సాపూర్ ఆసుపత్రులకు తరలించారు. బస్సుల్లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను అతికష్టం మీద బయటకు తీశారు. డ్రైవర్ నాగరాజు(56)ను నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో డ్రైవర్ యాదగిరిని హైదరాబాద్‌కు తరలించారు. ఉదయం ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. మృతి చెందిన డ్రైవర్ నాగరాజు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రి కాగా.. పటాన్‌చెరులో స్థిరపడ్డారు. మృతుడు నాగరాజు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లింగం చెప్పారు.

మాది చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: కాంగ్రెస్ సర్కారు భారాస ప్రభుత్వంలా మాటలు చెప్పేది కాదని చేతలు చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పురపాలిక ఉపఛైర్మన్ శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, రాజేష్‌చౌహాన్, సద్దాం, తాహెర్‌అలీ పాల్గొన్నారు. ● కంగ్టి మండలం చాప్టా(బి)లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ చేసినట్లు మాజీ ఎంపీపీ నాగన్న పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలకు ఇద్దరి ఎంపిక

జిన్నారం: వరంగల్‌లో ఈనెల 28 నుంచి జరిగే అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు జిన్నారం గురుకులానికి చెందిన కె.ప్రతాప్, బి.అంజి ఎంపికైనట్లు కోచ్ మహేశ్ పేర్కొన్నారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపల్ వెంకట్‌నారాయణ, వైస్ ప్రిన్సిపల్ వెంకటయ్య అభినందించారు.

ఖాళీ ప్లాట్లు.. దోమలతో పాట్లు

జహీరాబాద్, జిన్నారం, గుమ్మడిదల



మూసానగర్ కాలనీలో మురుగునీటి గుంట

అసలే వర్షాకాలం, ఆపై రోగాలు వెంటాడే సీజన్ కావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ తక్షణ ఏర్పాట్లు చేయాలని పురపాలక శాఖ అధికారులతో ఇటీవల మంత్రి దామోదర్ రాజనర్సింహ నిర్వహించిన సమీక్షలో సూచించారు. ఇలా ఏటా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మారడం లేదు. పల్లె, పట్టణాల్లోని కాలనీల ఇళ్ల మధ్య ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాల్లో చెత్తాచెదారం వేయడం, మురుగు వదలటంతోపాటు, వర్షాకాలంలో నీరు చేరి దోమలకు నిలయంగా మారుతోంది.

సర్వే చేసినా.. చర్యలు శూన్యం

జిల్లాలో లక్ష పైచిలుకు జనాభా, 37 వార్డులు కలిగిన జహీరాబాద్ పట్టణంలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. శివారు ప్రాంతాల్లో కొందరు ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోగా, ఖాళీగా ఉన్నవి సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. ముఖ్యంగా చెన్నారెడ్డి నగర్, ఆదర్శ నగర్, సాయిరామ్ నగర్, టీచర్స్ కాలనీ, మహీంద్రా కాలనీ, బేతేల్ కాలనీ, రామ్‌నగర్, గాంధీనగర్, గుల్షన్‌నగర్, మూసానగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్యన ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో పురపాలక అధికారులు సర్వేలు నిర్వహించి ఖాళీ ప్లాట్లను గుర్తిస్తున్నా... ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రతిఏటా పిచ్చిమొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి.

కాల్వల నిర్మాణం మరిచారు!

నిబంధనల ప్రకారం ప్రజల ఆరోగ్య భద్రతకు పంచాయతీలు, పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్లాట్లను శుభ్రం చేయాలని సంబంధిత యజమానులకు తాఖీదులు జారీచేసి పది, పదిహేను రోజుల్లో స్పందించకుంటే జరిమానాలు విధించాలి. కాని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయి. దీనికితోడు అధికారులు పలు ప్రాంతాల్లో కాల్వలు నిర్మించకపోవడంతో ఎక్కడిక్కడ కూడా మురుగు పేరుకపోతోంది.

చర్యలు తీసుకుంటాం

శివారు కాలనీల్లో నిర్మాణాలు తక్కువగా ఉండటంతో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉంటున్నాయి. వాటిల్లో పొదలు పెరగడం తోపాటు వర్షపు నీరు నిలిచి పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రమవుతుంది. త్వరలోనే ఖాళీ స్థలాలను గుర్తించి తాఖీదులు జారీచేసి.. స్పందించకుంటే జరిమానా వేయడంతోపాటు వాటి శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.– **జి.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ పురపాలక సంఘం జహీరాబాద్.**

కొండా లక్ష్మణ్‌కు నివాళి

స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. –న్యూస్‌టుడే బృందం.



సదాశివపేటలో చిత్రపటానికి పూలమాలలు



సంగారెడ్డిలో..



జిన్నారంలో...

బదిలీ ఉద్యోగులకు సన్మానం



మునిపల్లి: బదిలీపై వెళ్లిన మునిపల్లి మండల ఎంఈవో దశారాథ్, కొండపూర్ మండలం నుంచి మునిపల్లికి బదిలీపై వచ్చిన భీంసింగ్‌లను టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల వనరుల కేంద్రంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్, గోవర్ధన్, లక్ష్మణ్, ముజూఫరుద్దీన్, అమీనొద్దిన్, సంతోషమ్మ, అనురాధ, సుభాష్, నాగేశ్వర్, సాయిలు తదితరులు ఉన్నారు.

న్యాల్‌కల్: బదిలీపై వెళ్లిన ఏవో లావణ్యను ముంగి రైతు వేదికలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏడీఏ భిక్షపతి, వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్‌వో భూపాల్, సహకార సంఘం ఛైర్మన్లు జగన్నాథ్‌రెడ్డి, సిద్ధలింగయ స్వామి, ఝరాసంగం ఎఈవో, కోహీర్ ఎఈవో, రైతులు పాల్గొన్నారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వండి

నారాయణఖేడ్: ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏలకు సంబంధించిన వారసులు శుక్రవారం ఖేడ్ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20,555 మంది వీఆర్‌ఏల్లో 16,758 మందిని అర్హతలను బట్టి వివిధ శాఖల్లో నియామక ఉత్తర్వులతోపాటు ఐడీలు ఇచ్చారని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

జహీరాబాద్ అర్బన్, నారాయణఖేడ్, జిన్నారం, జోగిపేట: ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని జహీరాబాద్ మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. హుగ్గెల్లిలో శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుభ్రత పనులు పరిశీలించారు. ● ఖేడ్‌లో రైతుబజార్‌లో పొదలు తొలగించి అవగాహన కల్పించినట్లు కమిషనర్ జగ్జీవన్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. ● అందోలు మండల ప్రత్యేకాధికారిణి గీత, ఎంపీడీఓ రాజేష్‌కుమార్, ఎంపీఓ అశోక్ సంగుపేట, అన్నాసాగర్ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ● ఐడీఏ బొల్లారం పట్టణంలోని 16, 17 వార్డుల్లో ఐడీఏ పురపాలిక అధ్యక్షురాలు రోజారాణి రూ.50 లక్షలతో నిర్మించే రోడ్డు పనులను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు.



హుగ్గెల్లిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ..

రుణమాఫీకి జాప్యం తగదు

జోగిపేట టౌన్: రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో షరతులు విధించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. వెంటనే అమలు చేయాలన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సేవాలాల్ మహరాజ్ మాలధారణ

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మండలం మల్‌చెల్మతండా, సేడేగుట్ట తండాల్లో శుక్రవారం బంజారా యువకులు సంత్ సేవాలాల్ మహరాజ్ దీక్ష ఆచరణ ప్రారంభించారు. మాలధారణకు ముందుకొచ్చిన యువకులకు మహారాష్ట్రలోని పౌరాదేవి ఆశ్రమ ప్రతినిధి శేఖర్ మహరాజ్, పూజారి రవి తదితరులు అభినందించారు.

పంటల పరిశీలన



జూకల్ శివారులో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాస్త్రవేత్తలు

సిర్గాపూర్, కల్హేర్, మనూరు, నారాయణఖేడ్: పత్తిలో పోషక లోపం వల్ల కాయలు పిందెలు రాలుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త శిజయ పేర్కొన్నారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్వేత, రాహుల్ విశ్వకర్మ, సరిత, ఏడీఏ నూతన్ కుమార్, ఏవో ఆసియా బేగం, వెంకటేశం, మహేష్ చౌహాన్, ఏఈఓలు పాల్గొన్నారు. * మనూరు మండలం డోవ్పూర్‌లో పంటలను శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించారు. సిద్దిపేట జిల్లా ఏఆర్‌ఎస్ తోర్నాల్ శాస్త్రవేత్త శ్రీజయ, న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్లు రాహుల్, విశ్వకర్మ, ఉద్యానవన శాస్త్రవేత్త సరిత, శ్వేత, నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్, మనూరు, నారాయణఖేడ్ ఏవోలు మహేష్ చౌహాన్, వెంకటేశం, ఏఈవోలు ప్రవీణ్‌కుమార్, సంగమేశ్వర్, వెంకటేశం, ప్రశాంత్, గ్రామ రైతులు ఉన్నారు. * ఖేడ్ మండలం జూకల్ శివారులో సాగైన వరి, పత్తి పంట పొలాలను శుక్రవారం ఏఆర్‌ఎస్ తోర్నాల్ శాస్త్రవేత్త శ్రీజయ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్‌విశ్వకర్మ, ఉద్యానవన శాస్త్రవేత్తలు సరిత, శ్వేత, ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్, ఏవోలు శంకర్, వెంకటేశం, ఆసియాబేగం, ఏఈఓలు రాందాస్, హరీష్, సతీష్, రఘునాథ్, సురేష్, సవిత సందర్శించారు. ఆయా పంటలను పరిశీలించి ఇటీవల పలుమార్లు కురిసిన భారీవర్షాల నేపథ్యంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలనిచ్చారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు




గుమ్మడిదల నుంచి పంట పొలాలకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకుతోడు భారీ వాహనాల రాకపోకల వల్ల ధ్వంసమైంది. గతంలో రోడ్డు వేసే సమయంలో గుత్తేదారు నాణ్యత పాటించకపోవడంతోనూ ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో రైతులు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని ఈ దారికి వెంటనే మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. 'న్యూస్‌టుడే' ప్రతినిధి ఏఈ శశిధర్‌రెడ్డితో మాట్లాడగా.. రోడ్డు పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, గుమ్మడిదల.

చదువుల ఒడి.. ఆకతాయిలకు అడ్డాగా...



జిన్నారానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థుల చదువుతున్నారు. దీనికి ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళలు, సెలవు రోజుల్లో ఆకతాయిలకు అడ్డాగా మారింది. పలువురు కిటికీ అద్దాలు ధ్వంసం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పగులకొట్టారు. గతంలో హెటిరో పరిశ్రమల సామాజిక సేవా కార్యక్రమంలో రూ.3 కోట్లు కేటాయించి ఈ కళాశాలను నిర్మించింది. సమస్య తీవ్రత దృష్ట్యా మళ్లీ ఎవరైనా దాతలు ముందుకొచ్చి ప్రహరీ నిర్మించడంతోపాటు కాపలాదారుని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జిన్నారం.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



జోగిపేట టౌన్: స్థానిక ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో శుక్రవారం అగ్నిమాపక ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన పద్ధతులపై ఆ శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్లలో మంటలు వచ్చినప్పుడు ఎలా ఆర్పివేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజిత, అధ్యాపకులు విఠల్, శ్రీనివాస్, గోవర్ధన్, మల్లేశం, శ్రవణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి



బాలయ్య

పుల్కల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి.. పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మునిపల్లికి చెందిన సీహెచ్ బాలయ్య(50) పుల్కల్ మండలంలోని పోచారానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. సింగూరు ప్రాజెక్టు వద్దకు రాగానే బాలయ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మరణించాడు. మరో వాహనంపై వచ్చిన ఇద్దరూ గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ గ్రామాలుగా గుర్తించండి

వట్‌పల్లి, న్యూస్‌టుడే: కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని ఎన్పీఆర్డీ డివిజన్ అధ్యక్షుడు సుభాష్ శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

పిల్లలతో స్నేహ పూర్వకంగా మెలగాలి

సంగారెడ్డి అర్బన్: పిల్లలతో స్నేహంగా మెలగాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవానీచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో పిల్లల సంరక్షణ, రక్షణ, న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. నేరారోపణ ఎదుర్కొంటున్న చిన్న పిల్లలకు న్యాయసేవలు అందించేందుకు ప్రతి శుక్రవారం ఈ కేంద్రంలో న్యాయవాది, పారా లీగల్ కార్యకర్త అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్, జువైనల్ జస్టిస్ బోర్డు కోర్టు న్యాయమూర్తి శాలిని, బాలల పరిరక్షణ విభాగం అధికారి రత్నం పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం

కోహీర్: యూటీఎఫ్ కోహీర్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా ఎం.డి.బద్రుద్దీన్, కార్యదర్శిగా ప్రసన్న, సభ్యులుగా రజీయోద్దీన్, వాసవి, వెంకటేశ్వరరాజు, విఠల్, క్రాంతి, రాము, పాండు, అన్నపూర్ణ, హమీద్- బిన్-సయీద్, అన్నపూర్ణ నియమితులయ్యారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

జహీరాబాద్ అర్బన్: దేవర సినిమా విడుదల సందర్భంగా జహీరాబాద్‌లో జూ.ఎన్టీఆర్ అభిమానులు పండ్లు పంపిణీ చేశారు.

వేతనాలు చెల్లించాలి

మునిపల్లి: తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి సకాలంలో జీతాలు చెల్లించాలని ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ శుక్రవారం డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.


దొరకని ఆచూకీ!

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ మండలం బూచినెల్లి నారింజ వాగులో బుధవారం గల్లంతైన షాకీర్ కోసం రెండోరోజు పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చేయించినా ఆచూకీ లభించలేదని సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: గుమ్మడిదల పీఎస్‌లో మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా మారాయని, నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామాజిక సేవల్లోనూ పాల్గొనాలి



ప్రవచిస్తున్న స్వామీజీ

గుమ్మడిదల: ఆధ్యాత్మిక చింతనతోనే మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు. శుక్రవారం గుమ్మడిదలలో 'సేవా బృందం' ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక రుద్రాభిషేకాల అనంతరం ఆయన మాట్లాడారు. దైవసేవతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనడం వల్ల ఉత్తమ సమాజ నిర్మాణానికి తోడ్పడినట్లు అవుతుందన్నారు.

28న చలో కలెక్టరేట్

సంగారెడ్డి టౌన్: చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు తదితర డిమాండ్లతో ఈ నెల 28న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

29న నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: చక్రియాల నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి గుమ్మడిదల, జిన్నారం మండలాలకు చెందిన 500ల నివాస ప్రాంతాలకు మంజీరా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. తిరిగి ఆదివారం సరఫరా డీఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నిత్యం ప్రయాణ బడలికే!



జంగంపేట నుంచి వావిలాల జడ్పీ పాఠశాలకు నడిచి వస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, జిన్నారం, గుమ్మడిదల, జహీరాబాద్: ఎన్నో ప్రతిష్ఠాత్మక పరిశ్రమలున్న ప్రాంతాలని, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతాయని చెప్పుకునే జిన్నారం, గుమ్మడిల, జహీరాబాద్ ప్రాంతాల్లోని సమస్యలు మాత్రం తీరటం లేదు. పలు గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే కాలినడక తప్పటం లేదు.

అనేక గ్రామాల్లో అదే పరిస్థితి

జిన్నారం మండలం వావిలాల జడ్పీ పాఠశాలకు సమీపంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు రాకపోకలు నిత్యం సాగిసుంటారు. జంగంపేట నుంచి 45 మంది బాలబాలికలు, లక్ష్మీపతిగూడెం నుంచి 15 మంది, చౌదరిగూడెం నుంచి నలుగురు విద్యార్థులకు కాలినడక వస్తుంటారు. ఖాజీపల్లికి సకాలంలో బస్సులు లేకపోవడంతో మల్లంపేట నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వస్తుంటారు. ఖాజీపల్లి నుంచి ఐడీఏ బొల్లారం జడ్పీ పాఠశాలకు, ఆదర్శ పాఠశాలకు వెళ్లే వారి పరిస్థితి ఇలాగే ఉంది. సోలక్‌పల్లి, శివానగర్ రూట్లో బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ప్రత్యేకంగా గుర్తించి పరిష్కరించాలని ఇప్పటికే విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఇటీవల ధర్నాలు చేశారు. రొయ్యపల్లి నుంచి మంగంపేట, జిన్నారం వచ్చే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. మంత్రికుంట, కొర్లకుంట గ్రామాల నుంచి మాదారం వెళ్లే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. ఇప్పటికైనా ఆర్టీసీ అన్ని రూట్లలో బస్సులు నడపాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపండి...

కాలినడకన వచ్చే పేద విద్యార్థులను గుర్తించి పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో సైకిళ్లు పంపిణీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. సుమారు 250 వరకు సైకిళ్లు ఇస్తే సమస్య తీరుతుందని చెబుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు సైతం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తెస్తానని మండల విద్యాధికారి కుమారస్వామి 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

ఖాజీపల్లి(జిన్నారం): ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాజీపల్లి శివారు 181 సర్వే సంఖ్యలోని గుట్టపై శుక్రవారం జూదం శిబిరాలపై దాడిచేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై దశరథ తెలిపారు. రూ.14 వేల నగదు, ద్విచక్రవాహనం, పలు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నవ వధువు బలవన్మరణం



వైష్ణవి

సిర్గాపూర్(కల్హేర్): పెళ్లి ఇష్టం లేక జీవితంపై విరక్తి చెందిన నవ వధువు బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (21)కి నిజాంపేట మండలం ఖానాపూర్(బీ)వాసి హన్మండ్లుతో ఆరు నెలల కిందట వివాహమైంది. తల్లిదండ్రులు ఇష్టంలేని పెళ్లి చేశారని వైష్ణవి మదనపడుతోంది. ఇంట్లో ఎవరితో మాట్లాడకుండా ఉంటోంది. గురువారం ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి తండ్రి బాలాజీ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

హత్నూర: పరిశ్రమల్లో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.